సాక్షి పల్నాడు

శనివారం । 5 । ఏప్రిల్ । 2025




రిఫ్రిజిరేటర్ బహూకరణ

పిడుగురాళ్ల: పట్టణ పోలీస్ స్టేషన్‌కు రిఫ్రిజిరేటర్‌ను తిరుమల ఆక్స్‌ఫర్డ్ విద్యాసంస్థల తరఫున శుక్రవారం అందించారు. డీఎస్పీ జగదీష్ పాల్గొన్నారు.



వైభవంగా మహా కుంభాభిషేకం

పొన్నూరు: పొన్నూరు పట్టణంలోని తెలగ పాలెంలో ఉన్న కోదండ రామాలయంలో మహా కుంభాభిషేకం మహోత్సవం శుక్రవారం వైభవంగా నిర్వహించారు.



సాగర్ నీటిమట్టం

విజయపురిసౌత్: నాగార్జున సాగర్ జలాశయ నీటిమట్టం శుక్రవారం 517.50 అడుగుల వద్ద ఉంది. కుడి కాలువకు 3,031 క్యూసెక్కులు విడుదలవుతోంది.

బర్డ్‌ఫ్లూ మృతిపై కేంద్ర బృందం ఆరా







బర్డ్‌ఫ్లూతో బాలిక మృతి కలకలం రేపిన నేపథ్యంలో కేంద్రం అప్రమత్తమైంది. జిల్లాలోని నరసరావుపేట పట్టణం బాలయ్యనగర్‌కు చెందిన పెండ్యాల గోపీ, జ్యోతిల కుమార్తె ఆరాధ్య (2) బర్డ్‌ఫ్లూతో గత నెల 15న మంగళగిరి ఎయిమ్స్‌లో చికిత్స పొందుతూ మృతి చెందిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో శుక్రవారం మృతురాలి ఇంటి పరిసరాలను స్థానిక వైద్యాధికారులతో కలిసి పరిశీలిస్తున్న కేంద్ర బృంద సభ్యులు ... నరసరావుపేట పల్నాడు రోడ్డులోని చికెన్ స్టాళ్లలో కేంద్ర బృంద పర్యవేక్షణలో కోళ్ల రక్తం, ఇతర నమూనాలను సేకరిస్తున్న స్థానిక పశుసంవర్ధక శాఖ సిబ్బంది - నరసరావుపేట

న్యూస్‌రీల్

పోయిన డబ్బులు దొరికాయోచ్..!



ముప్పాళ్ళ: పింఛన్ డబ్బులు పోయాయి... మరలా దొరికాయోచ్...! అవును ఇది నిజమే. డబ్బులు కట్టకట్టి మరీ గ్రామసచివాలయం లోనే ఉంచడం మరింత ఆశ్చర్యకరం. మండలంలోని చాగంటివారిపాలెం గ్రామ సచివాలయంలో పనిచేసే ఇంజినీరింగ్ అసిస్టెంట్ పంపిణీ చేయాల్సిన పింఛన్ సొమ్ములో రూ.50 వేలు ఈ నెల 1వ తేదీన గ్రామ సచివాలయం లోనే పంపిణీకి ముందు కనిపించకుండా పోయాయి. సహచర సిబ్బంది, మిత్రుల వద్ద డబ్బు అప్పుగా తీసుకొని పింఛన్ పంపిణీని సజావుగా పూర్తి చేశారు. మూడు రోజుల తర్వాత పోలీసులకు ఫిర్యాదు చేసేందుకు సిద్ధమయ్యారు. ఈ తరుణంలోనే శుక్రవారం ఉదయం సచివాలయం తెరవగానే రూ.50 వేల నగదును ఒక కవర్‌లో పెట్టి నేలపై కనిపించాయి. ఇదంతా ఇంటి దొంగల పనే అనే అనుమానాన్ని స్థానికులు వ్యక్తం చేస్తున్నారు. ఇంత జరిగినా ఈ విషయం ఎక్కడా బయటకు రాకుండా సచివాలయ సిబ్బంది జాగ్రత్తలు తీసుకున్నారు.

బోయపాలెం డైట్‌లో పోస్టుల భర్తీకి దరఖాస్తుల స్వీకరణ

గుంటూరు ఎడ్యుకేషన్: ప్రత్తిపాడు మండలం బోయపాలెం జిల్లా వృత్తి విద్యాశిక్షణా సంస్థ (డైట్)లో సీనియర్ లెక్చరర్, లెక్చరర్ పోస్టుల్లో డెప్యూటేషన్‌పై పని చేసేందుకు ఉమ్మడి గుంటూరు జిల్లాలోని ప్రభుత్వ, జెడ్పీ, మున్సిపల్ పాఠశాలల్లో పని చేస్తున్న ఎంఈఓలు, హెచ్ఎంలు, స్కూల్ అసిస్టెంట్లు ఈనెల 10వ తేదీ లోపు దరఖాస్తు చేయాలని జిల్లా విద్యాశాఖాధికారి సీవీ రేణుక శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈ మేరకు పాఠశాల విద్యాశాఖ డైరెక్టర్ ఉత్తర్వులు విడుదల చేసినట్లు తెలిపారు. వివిధ విభాగాల్లో ఖాళీగా ఉన్న పోస్టులను డిప్యూటేషన్ ప్రాతిపదికన భర్తీ చేసేందుకు రాత పరీక్ష, ఇంటర్వ్యూ నిర్వహిస్తామని తెలిపారు. ఈనెల 10 వరకు దరఖాస్తులు స్వీకరించి, ఈనెల 16,17వ తేదీల్లో పరీక్షలు, ఈనెల 19న ఇంటర్వ్యూ నిర్వహిస్తామని పేర్కొన్నారు. పూర్తి వివరాలకు డబ్ల్యూడబ్ల్యూడబ్ల్యూ.డైట్‌బోయపాలెం.కామ్ సందర్శించాలని, సందేహాల నివృత్తికి 94408 46046 నంబర్లో సంప్రదించాలని సూచించారు. ఆఫ్‌లైన్‌లో దరఖాస్తును ప్రతి సబ్జెక్టుకు వేర్వేరుగా చేయాలని, దరఖాస్తుల స్వీకరణకు గుంటూరు డీఈవో కార్యాలయంలో ప్రత్యేక కౌంటర్ ఏర్పాటు చేసినట్లు తెలిపారు.

జీజీహెచ్‌లో మీకోసం మేము

గుంటూరు మెడికల్: గుంటూరు జీజీహెచ్‌లో 7వ వారం మీకోసం మేము పేషెంట్ డాక్టర్ ఇంటరాక్షన్ కార్యక్రమం శుక్రవారం జరిగింది. ఈ సందర్భంగా సూపరింటెండెంట్ డాక్టర్ యశశ్వి రమణ పేషెంట్‌లకు హాస్పిటల్ నియమావళి గురించి సూచనలు చేశారు. ల్యాబ్ పరీక్షలు, మరేదైనా ఎవరైనా ఎటువంటి ప్రలోభాలకు మోసపోవద్దని తెలిపారు. ఎలాంటి సమస్యనైనా ఎవరికీ డబ్బు చెల్లించవద్దని, ఒకవేళ ఎవరైనా డబ్బు అడిగితే రశీదు అడగాలని, ఇవ్వని పక్షంలో సూపరింటెండెంట్, సీఎస్ఆర్ఓంకు ఫిర్యాదు చేయాలన్నారు. కార్యక్రమంలో నర్సింగ్ సిబ్బంది, హాస్పిటల్ సిబ్బంది పాల్గొన్నారు.

మూల్యాంకన కేంద్రంలో పరిశీలన



నరసరావుపేట ఈస్ట్: పదవ తరగతి పబ్లిక్ పరీక్షల జవాబు పత్రాల మూల్యాంకనంలో పాల్గొంటున్న ఉపాధ్యాయులకు అసౌకర్యం కలగకుండా చూడాలని జిల్లా కలెక్టర్ పి.అరుణ్‌బాబు ఆదేశించారు. కేబీఆర్ కళాశాలలో నిర్వహిస్తున్న మూల్యాంకన కేంద్రాన్ని శుక్రవారం ఆయన పరిశీలించారు. పొరపాట్లకు తావివ్వకుండా ప్రతి విద్యార్థి సామర్థ్యానికి అనుగుణంగా మార్కులు కేటాయించాలన్నారు. సకాలంలో మూల్యాంకనం పూర్తి చేయాలని సూచించారు. కేంద్రంలోని స్ట్రాంగ్ రూమ్, మూల్యాంకనం గదులు, వైద్య సదుపాయం తదితర ఏర్పాట్లను పరిశీలించారు. కార్యక్రమంలో జిల్లా విద్యాశాఖాధికారి ఎల్.చంద్రకళ, జిల్లా ప్రభుత్వ పరీక్షల అసిస్టెంట్ కమిషనర్ కె.ఎం.ఎ.హుస్సేన్, డిప్యూటీ డీఈఓలు ఎస్ఎం సుభాని, ఏసుబాబు పాల్గొన్నారు.

గుప్పుచప్పుడు కాకుండా సాగు!

- గతంలో రాష్ట్రంలో తొలిసారి నరసరావుపేటలో గంజాయి చాక్‌లెట్లు స్వాధీనం
- కళాశాల విద్యార్థులే లక్ష్యంగా విక్రయాలు
- గత ప్రభుత్వంలో సెబ్ ద్వారా మత్తు పదార్థాల వినియోగం కట్టడి
- కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత సెబ్‌కు మంగళం
- ఏకంగా టీడీపీ నేత పొలంలోనే నిమ్మతోట ముసుగులో గంజాయి సాగు

పల్నాడు జిల్లాలో విస్తరిస్తున్న గంజాయి వినియోగం



స్వాధీనం చేసుకున్న గంజాయి చాక్‌లెట్లతో ఈఎస్ మణికంఠ (ఫైల్)

నరసరావుపేటలో గతంలో పట్టుబడ్డ గంజాయి నిల్వలు (ఫైల్) →



నరసరావుపేట టౌన్: పల్నాడు జిల్లాలో గంజాయి సంస్కృతి చాపకింద నీరులా విస్తరిస్తోంది. యువతను లక్ష్యంగా చేసుకొని విక్రయాలకు సాగుతున్నాయి. రాష్ట్రంలో మొదటి సారి పల్నాడు జిల్లా నరసరావుపేట నియోజకవర్గం కోటప్పకొండ వద్ద బడ్డీ కొట్టులో విక్రయిస్తున్న గంజాయి చాక్‌లెట్లు రెండు నెలల క్రితం పట్టుబడ్డాయి. ఈ సంఘటన అప్పట్లో సంచలనం సృష్టించింది. ఇది మరువకముందే సత్తెనపల్లి నియోజకవర్గం రాజుపాలెం మండలంలో నిమ్మతోట ముసుగులో గంజాయి సాగు వెలుగుచూసింది. ఏజెన్సీ ప్రాంతాల్లో పరిమితమైన గంజాయి సాగును పల్నాడు ప్రాంతానికి కూడా తేవటం కలకలం రేపుతోంది. అధికారుల పర్యవేక్షణ లోపాన్ని అవకాశంగా మార్చుకున్న టీడీపీ నేతలు మాదక ద్రవ్యాల అక్రమ సాగుకు తెరలేపుతున్నారు. గత టీడీపీ హయాంలో చిలకలూరిపేట నియోజకవర్గం గొరిజవోలు గ్రామంలో టీడీపీకు చెందిన ఓ వ్యక్తి మిర్చి సాగు ముసుగులో గంజాయి పంట పండించాడు. అధికారులు దాడులు చేసి కేసు నమోదు చేశారు. తర్వాత తాజాగా అదే మాదిరి కార్యకలాపాలు సత్తెనపల్లి నియోజకవర్గ ప్రాంతంలో పునరావృతం అయ్యాయి.

టీడీపీ నేత ఆధ్వర్యంలో..

రాజుపాలెం మండలం మొక్కపాడు గ్రామంలో బుధవారం గంజాయి ఆకులు కలిగి ఉన్న ముగ్గురిని అక్కడి పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. వారి నుంచి పెద్ద మొత్తంలో గంజాయి నిల్వలను స్వాధీనం చేసుకున్నారు. వారు ఇచ్చిన సమాచారంతో గ్రామానికి చెందిన టీడీపీ నేత పొలంలో తనిఖీలు చేపట్టారు. అక్కడ నిమ్మతోట ముసుగులో గంజాయి సాగు చేస్తున్నట్లు గుర్తించారు. గంజాయి మొక్కలను స్వాధీనం చేసుకొని పరీక్షల కోసం వాటిని ల్యాబ్‌కు పంపించారు. పొలాల్లో సాధారణ పంటల మాదిరిగా గత కొన్ని నెలలుగా సాగు చేస్తున్న ఈ గంజాయి మొక్కల వ్యవహారాన్ని అధికారులు గుర్తించలేక పోయారు. వ్యవసాయ పర్యవేక్షణ శాఖ అధికారులు సైతం మౌనంగా ఉన్నారు.

అధికారుల తీరు వల్లే....

రెగ్యులర్‌గా పర్యవేక్షణ చేయాల్సిన వ్యవసాయ, పోలీస్ శాఖలు మౌనం వహించడంపై పలు విమర్శలకు తావిస్తోంది. అధికారుల మద్దతు లేకుండా ఇలా సాగు సాధ్యపడదని ప్రజలు అభిప్రాయపడుతున్నారు. అధికార పార్టీకి చెందిన నాయకుడి పొలం కావటంతో అధికారులు మాట్లాడేందుకు కూడా సాహసించటం లేదు.

విద్యార్థులు యువతే లక్ష్యం

జిల్లాలో కొన్ని నెలలుగా ఏదో ఒక ప్రాంతంలో గంజాయి పట్టుబడటం విద్యార్థుల తల్లిదండ్రులను ఆందోళన కలిగిస్తోంది. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయంలో మాదక ద్రవ్యాలను పూర్తి స్థాయిలో నిర్మూలించేందుకు స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో (సెబ్)ను ఏర్పాటు చేశారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత సెబ్‌ను తొలగించి, ఎక్సైజ్ శాఖలో విలీనం చేసింది. కూటమి ప్రభుత్వం ఈగల్ అనే పేరుతో టీమ్‌ను సిద్ధం చేసినా సిబ్బందిని కేటాయించలేదు. ఆశించిన మేర ఫలితాలు దక్కడం లేదు. జిల్లాలో అక్కడక్కడ గంజాయి పట్టుకొని కేసులు నమోదు చేసిన పోలీసులు చేతులు దులుపుకొంటున్నారు. మూలాలపై దృష్టి సారించటం లేదు. నరసరావుపేట కేంద్రంగా గంజాయి విక్రయాలు జోరుగా కొనసాగుతున్నాయి. ప్రధానంగా పట్టణం నుంచే ఇతర ప్రాంతాలకు సరఫరా అవుతున్నట్లు ఆరోపణలు లేకపోలేదు. నిర్మానుష్య ప్రాంతాల్లో, పట్టణ శివారు రియల్ ఎస్టేట్ వెంచర్‌లలో యువత గుంపులుగా చేరి గంజాయి తీసుకుంటున్నారు. మత్తుకు బానిసలుగా మారి అనేక మంది నేరాలకు పాల్పడుతున్నారు. స్కూళ్లు, కాలేజీల పరిసరాల్లో మాదక ద్రవ్యాల వినియోగం పెరిగిందని నివేదికలు సైతం చెబుతున్నాయి.

గంజాయి సాగు చేస్తే చర్యలు

గంజాయి సాగు చేస్తే **బాధ్యులపై కఠిన చర్యలు తప్పవన్నారు. రాజుపాలెం మండలం మొక్కపాడు** గ్రామంలో గంజాయి సాగు విషయం వెలుగు చూసిన తర్వాత జిల్లాలోని అన్ని ఎక్సైజ్ పోలీస్ అధికారులను అప్రమత్తం చేశాం. తనిఖీలు చేపట్టాలని ఆదేశించామని పేర్కొన్నారు.

- కె. మణికంఠ, ఎక్సైజ్ సూపరింటెండెంట్

ఇంకొల్లులో భారీ దొంగతనం



ఇంకొల్లు (చినగంజాం): బాపట్ల జిల్లా ఇంకొల్లులో భారీ దొంగతనం చోటుచేసుకుంది. గుర్తు తెలియని వ్యక్తులు ఇంటిలోకి చొరబడి బీరువాలో దాచి ఉంచిన రూ.55.50 లక్షల నగదు, రూ.20 లక్షల విలువైన బంగారు నగలు అపహరించుకుని తీసుకెళ్లారు. ఎస్ఐ జీ సురేష్ అందించిన సమాచారం ప్రకారం... ఇంకొల్లు గ్రామంలో ఆర్టీసీ బస్టాండు ఎదురుగా ఉన్న ఇంటిలో జాగర్లమూడి శివప్రసాద్ నివాసం ఉంటున్నారు. ఆయన రెండో అంతస్తులో నిద్రిస్తున్నాడు. గురువారం అర్ధరాత్రి సమయంలో గుర్తు తెలియని వ్యక్తులు గుట్టుచప్పుడు కాకుండా ఇంటిలోని మూడో అంతస్తులోకి ప్రవేశించి గది తాళాలు పగులగొట్టి బీరువాలో ఉన్న రూ.55.50 లక్షల నగదు, 24 సవర్ల బంగారు వస్తువులను అపహరించి తీసుకెళ్లారు. ఉదయం నిద్ర లేచిన ఆయన దొంగతనం జరిగినట్లు గుర్తించారు. వెంటనే పోలీసులకు సమాచారం ఇచ్చారు. పోలీసులు రంగంలోకి దిగి సంఘటనా స్థలాన్ని సందర్శించారు. సంఘటనా స్థలాన్ని పరిశీలించిన ఇంకొల్లు సీఐ వైవీ రమణయ్య, ఎస్ఐ జీ సురేష్‌లు క్లూస్ టీంను పిలిపించి వేలిముద్రలు, ఇతర ఆధారాలను సేకరించారు. తాను డైరెక్టర్‌గా ఉన్న ఎంఆర్ఆర్ ప్రకాశం హైస్కూల్ విద్యార్థుల ఫీజులు రూ.20 లక్షలు, పంట అమ్మిన డబ్బు రూ.30 లక్షలు, హోటల్ వ్యాపారం ద్వారా తన సోదరులు సంపాదించిన మరో రూ.5.50 లక్షల నగదుతో పాటు మరో రూ.20 లక్షల విలువైన బంగారు నగలు అపహరణకు గురైనట్లు శివప్రసాద్ ఫిర్యాదులో పేర్కొన్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

కేంద్రీయ విద్యాలయాలు ఏర్పాటు చేయండి



అధికారులతో మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్ పి.అరుణ్‌బాబు

అధికారులకు కలెక్టర్ ఆదేశం

నరసరావుపేట: పల్నాడు జిల్లాకు సంబంధించి రొంపిచర్ల, మాచర్లలో మంజూరైన కేంద్రీయ విద్యాలయాల ఏర్పాటుకు అవసరమైన స్థలాన్ని అందించేలా చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులను జిల్లా కలెక్టర్ పి.అరుణ్‌బాబు ఆదేశించారు. శుక్రవారం కార్యాలయంలోని తన చాంబర్‌లో రెవెన్యూ అధికారులు, కేంద్రీయ విద్యాలయ ప్రతినిధులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మాచర్లలో అనువైన ప్రదేశాన్ని గుర్తించి తరగతులు నిర్వహించేలా ఏర్పాటు చేయాలన్నారు. దీనిపై మాచర్ల రెవెన్యూ అధికారి కిరణ్‌కుమార్ మాట్లాడుతూ మాచర్లలోని పీడబ్ల్యూడీ కాలనీ, జిల్లా పరిషత్ బాలుర పాఠశాలలో రూములు కేటాయించడానికి అనువుగా ఉన్నాయని కలెక్టర్ దృష్టికి తీసుకొచ్చారు. పీడబ్ల్యూడీ కాలనీలో ఐదెకరాల స్థలాన్ని గుర్తించామన్నారు. క్షేత్రస్థాయిలో స్థలాన్ని పరిశీలించి చర్యలు తీసుకోవాలన్నారు. రొంపిచర్లలో విద్యాలయ ఏర్పాటుకు గుర్తించిన స్థలాన్ని రీ వెరిఫై చేయాలని ఎమ్మార్వోకు సూచించారు. గురజాల, నరసరావుపేట ఆర్డీవోలు మురళీకృష్ణ, మధులత, రొంపిచర్ల మండల రెవెన్యూ అధికారి నిర్మల, కేంద్రీయ విద్యాలయాల డిప్యూటీ కమిషనర్ పాల్గొన్నారు.

'బర్డ్‌ఫ్లూ మృతి' పూర్తిగా ప్రభుత్వ వైఫల్యమే

- పల్నాడు జిల్లాను బర్డ్‌ఫ్లూ ఇన్‌ఫెక్షన్ సెంటర్‌గా ప్రకటించాలి
- రాష్ట్ర ఆరోగ్య శాఖ మంత్రి ఎందుకు పర్యటించలేదు?
- చిన్నారి కుటుంబానికి తక్షణమే ఎక్స్‌గ్రేషియా ప్రకటించాలి
- పాప మృతికి కారణం బర్డ్‌ఫ్లూ కాదని ఎమ్మెల్యే చెప్పడం హాస్యాస్పదం
- మాజీ ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి
- బాధిత కుటుంబానికి ఆర్థిక సహాయం అందజేత



మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి

నరసరావుపేట: బర్డ్‌ఫ్లూ వ్యాధితో రెండేళ్ల చిన్నారి ఆరాధ్య మృతి నేపథ్యంలో వెంటనే పల్నాడు జిల్లాను బర్డ్‌ఫ్లూ ఇన్‌ఫెక్షన్ సెంటర్‌గా ప్రకటించాలని మాజీ శాసనసభ్యులు డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఇది పూర్తిగా ప్రభుత్వ వైఫల్య ఫలితమేనని అన్నారు. శుక్రవారం పట్టణంలోని బాలయ్యనగర్ ఒకటో లైనులో ఉండే ఆరాధ్య కుటుంబాన్ని కేంద్ర బృందం పరిశీలించే సమయంలో ఆయన కూడా అక్కడకు వచ్చారు. జరిగిన విషయాన్ని తల్లిదండ్రులు పెండ్యాల గోపీ, జ్యోతిలను అడిగి తెలుసుకున్నారు. వారికి కొంత ఆర్థిక సహాయం అందజేశారు. అనంతరం ఆయన మీడియాతో మాట్లాడారు. బాలిక బర్డ్‌ఫ్లూతో చనిపోవటం బాధాకరమన్నారు. ప్రతిష్టాత్మకమైన మంగళగిరి ఎయిమ్స్ వైద్యులు అవయవాలు పనిచేయక పోవడం వల్ల బాలిక చనిపోయిందని నిర్ధారించారన్నారు. మొదటి బర్డ్‌ఫ్లూ కేసు 2021లో మహారాష్ట్రలో నమోదుకాగా, తిరిగి రెండో కేసు నరసరావుపేటలో నమోదు కావడం బాధాకరమైన విషయమన్నారు. ఈ పాపకు బర్డ్‌ఫ్లూ సోకిందనే విషయాన్ని దేశంలోని వైరాలజీ సంస్థ ఐసీఎంఆర్ నిర్ధారించగా, ఇది బర్డ్‌ఫ్లూ మరణం కాదని స్థానిక ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవిందబాబు మాట్లాడటం హాస్యాస్పదంగా ఉందన్నారు. జిల్లాను బర్డ్‌ఫ్లూ ఇన్‌ఫెక్షన్ సెంటర్‌గా ఎందుకు ప్రకటించలేదని ప్రశ్నించారు. ఈ ఏరియాలో 10 కోళ్లు కూడా బర్డ్‌ఫ్లూ వ్యాధితో చనిపోయాయని చెబుతున్నారని, దీని మీద కూడా విచారణ చేయాలని అన్నారు.

వలంటీర్లు ఉంటే మేలు జరిగేది

గతంలో కరోనా సమయంలో వలంటీర్లు ప్రతి ఇంటికి సర్వే నిర్వహించి ఏ ఇంట్లోనైనా జ్వరం, ఇతర వ్యాధి బాధితులు ఉంటే గుర్తించి వెంటనే చికిత్స పొందే ఏర్పాటు చేసేవారన్నారు. నరసరావుపేటలో చిన్నారి బర్డ్‌ఫ్లూ వ్యాధితో చనిపోతే ఆరోగ్య శాఖ మంత్రి ఏం చేస్తున్నారని ప్రశ్నించారు. ఇది పూర్తిగా ప్రభుత్వ వైఫల్యమని, ఈ కుటుంబానికి తక్షణమే ప్రభుత్వం ఎక్స్‌గ్రేషియా ప్రకటించాలని కోరారు. ఆయనతో పాటు వైఎస్సార్ సీపీ జిల్లా డాక్టర్ల విభాగం అధ్యక్షులు డాక్టర్ కామిరెడ్డి శ్రీనివాసరెడ్డి,, జెడ్పీటీసీ సభ్యులు పదముత్తం చిట్టిబాబు, నాయకులు పాల్గొన్నారు.

మిర్చి ఘాటు చూపిస్తాం

- ఆదుకోకుంటే త్వరలో యార్డు ముట్టడి
- ఏపీ రైతు, కౌలు రైతు సంఘాల హెచ్చరిక



ర్యాలీలో రైతు, కౌలు రైతు సంఘాల నాయకులు రాధాకృష్ణ, అజయ్‌కుమార్ తదితరులు

కొరిటెపాడు(గుంటూరు): మిర్చి రైతులను ఆదుకోవాలని కోరుతూ గుంటూరు మిర్చి యార్డులో ఏపీ రైతు సంఘం, కౌలు రైతు సంఘాల ఆధ్వర్యంలో శుక్రవారం ర్యాలీ నిర్వహించారు. ఏపీ కౌలు రైతు సంఘం రాష్ట్ర అధ్యక్షుడు వై.రాధాకృష్ణ, రైతు సంఘం రాష్ట్ర కమిటీ సభ్యుడు కంచుమాటి అజయ్‌కుమార్ మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నిర్ణయించిన క్వింటా మిర్చి ధర రూ.11,781లు మోసపూరితంగా ఉందని ధ్వజమెత్తారు. రైతులు క్వింటా మిర్చి పండించడానికి రూ.25 వేలు నుంచి రూ.30 వేలకు పైగా ఖర్చు అవుతుండగా, దీనిలో సగం మద్దతు ధర కల్పించడం దారుణమన్నారు. రాష్ట్ర ప్రభుత్వం అండతోనే కేంద్రంలోని ఎన్డీఏ ప్రభుత్వం అధికారంలో ఉందని, ఈ నేపథ్యంలో కేంద్ర ప్రభుత్వంపై ఎందుకు ఒత్తిడి చేయడం లేదని ప్రశ్నించారు. కేంద్ర ప్రభుత్వం ధరల స్థిరీకరణ నిధిని ఏర్పాటు చేసి రైతుల నుంచి మిర్చిని నేరుగా కొనుగోలు చేస్తే రైతులు, కౌలు రైతులకు న్యాయం జరుగుతుందని అభిప్రాయపడ్డారు. 2019 నుంచి 2023 వరకు క్వింటా మిర్చి రూ.18 వేలు నుంచి రూ.27 వేల వరకు ధర వచ్చిందని గుర్తుచేశారు. ఈ ఏడాది కేవలం రూ.7 వేలు నుంచి రూ.13 వేలు లోపు ధర పలికిందని ఆవేదన వ్యక్తం చేశారు. ఇవే ధరలు కొనసాగితే రైతులు అప్పుల పాలై ఆత్మహత్యలకు పాల్పడే ప్రమాదం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. రాష్ట్ర ప్రభుత్వం బడ్జెట్‌లో ధరల స్థిరీకరణ కింద కేవలం రూ.300 కోట్లు కేటాయించడం చూస్తే రైతులంటే కూటమి ప్రభుత్వానికి లెక్కలేదని స్పష్టమవుతోందని విమర్శించారు. ధరల స్థిరీకరణ నిధి కింద రూ.ఐదువేల కోట్లు కేటాయించాలని డిమాండ్ చేశారు. ముందుగా నరసరావుపేట రోడ్ వైపు ప్రధాన గేటు నుంచి నినాదాలు చేస్తూ మిర్చి యార్డు కార్యదర్శి చాంబర్ వరకు రైతులు ప్రదర్శన నిర్వహించారు. అనంతరం యార్డు కార్యదర్శి ఎ.చంద్రికకు వినతిపత్రం అందజేశారు. స్పందించిన యార్డు కార్యదర్శి చంద్రిక మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం నుంచి తమకు ఇప్పటివరకు ఎలాంటి విధి విధానాలు రాలేదని చెప్పారు. దీంతో రైతులు ఆగ్రహం వ్యక్తం చేశారు. మిర్చి రైతులను ఆదుకోకపోతే త్వరలో మిర్చి యార్డును ముట్టడిస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో ఏపీ రైతు, కౌలు రైతు సంఘాల గుంటూరు, పల్నాడు జిల్లాల నాయకులు బైరగాని శ్రీనివాసరావు, కె.రామారావు, జి.బాలకృష్ణ, బి.రామకృష్ణ, బిక్కి శ్రీనివాస్, జి.పిచ్చారావు, ఈవూరి అప్పిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

సరైన శిక్షణతో మెండుగా ఉపాధి అవకాశాలు



నరసరావుపేట: సరైన శిక్షణ పొందిన ప్రతి ఒక్కరికి మంచి ఉపాధి అవకాశాలు లభిస్తాయని జిల్లా రవాణాశాఖ అధికారి కె.సంజీవ్ కుమార్ పేర్కొన్నారు. శుక్రవారం స్థానిక ఏపీఎస్ఆర్టీసీ డిపోలో నిర్వహిస్తున్న హెవీ మోటార్ వెహికల్ డ్రైవింగ్ స్కూల్‌కు నరసరావుపేట ఆఫీస్ పరిధిలోని అన్ని డ్రైవింగ్ స్కూల్స్ తనిఖీలలో భాగంగా విచ్చేశారు. ఈ సందర్భంగా శిక్షణ పొందుతున్న వారితో మాట్లాడారు. ఆర్టీసీ జిల్లా ప్రజా రవాణా అధికారి ఎం.మధు, మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్ ఎస్.శివనాగేశ్వరరావు, అసిస్టెంట్ మోటార్ వెహికల్ ఇనస్పెక్టర్ వంశీకృష్ణ పాల్గొన్నారు.

పసుపు ధరలు



దుగ్గిరాల: దుగ్గిరాల పసుపు యార్డులో శుక్రవారం 635 బస్తాలు వచ్చాయి. పసుపు మొత్తం అమ్మకం చేసినట్లు వ్యవసాయ మార్కెట్ యార్డు కార్యదర్శి ఎన్.శ్రీనివాసరావు ఒక ప్రకటనలో తెలిపారు. కొమ్ములు 464 బస్తాలు వచ్చాయని, కనిష్ట ధర రూ.10,225, గరిష్ట ధర రూ.13,150, మోడల్ ధర రూ.12,811 పలికినట్టు వివరించారు. కాయలు 171 బస్తాలు వచ్చాయని, కనిష్ట ధర రూ.10,225, గరిష్ట ధర రూ.12,850, మోడల్ ధర రూ.12,811 పలికినట్టు వెల్లడించారు. మొత్తం 476.250 క్వింటాళ్ల అమ్మకాలు జరిగినట్లు వెల్లడించారు.

1,23,485 బస్తాల మిర్చి విక్రయం



కొరిటిపాడు(గుంటూరు): గుంటూరు మార్కెట్ యార్డుకు శుక్రవారం 1,13,955 బస్తాల మిర్చి రాగా గత నిల్వలతో కలిపి ఈ–నామ్ విధానం ద్వారా 1,23,485 బస్తాలు అమ్మకాలు జరిగాయి. నాన్ ఏసీ కామన్ రకం 334, నంబర్–5, 273, 341, 4884, సూపర్–10 రకాల సగటు ధర రూ.9,500 నుంచి రూ.14,000 వరకు పలికింది. నాన్ ఏసీ ప్రత్యేక రకం తేజ, బాడిగ, దేవనూరు డీలక్స్ రకాల సగటు ధర రూ.10,000 నుంచి రూ.13,500 వరకు ధర లభించింది. తాలు రకం మిర్చికి రూ.4,500 నుంచి రూ.6,300 వరకు ధర పలికింది. అమ్మకాలు ముగిసే సమయానికి యార్డులో ఇంకా 47,777 బస్తాలు నిల్వ ఉన్నట్లు యార్డు ఉన్నతశ్రేణి కార్యదర్శి ఎ.చంద్రిక తెలిపారు.

దారి మళ్లిన పేదల బియ్యం



గోదాము నుంచి వాహనంలో తరలిస్తున్న రేషన్ బియ్యం

బొల్లాపల్లి: పేదలకు పంపిణీ చేయాల్సిన ప్రజా పంపిణీ బియ్యం మార్గమధ్యలోనే పక్కదారి పడుతున్నాయి. గోదాము నుంచే నేరుగా అక్రమార్కుల దందా యథేచ్ఛగా కొనసాగుతోంది. అధికారులకు తెలిసినప్పటికీ, పట్టించుకున్న దాఖలాలు లేవని విమర్శలు వ్యక్తమవుతున్నాయి. బియ్యం అక్రమ వ్యాపారం దందా లోగుట్టు అధికారులకే ఎరుక అనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. శుక్రవారం గోదాము నుంచి చౌకధరల దుకాణానికి చేరుకోవలసిన రేషన్ బియ్యం వినుకొండ పట్టణానికి దగ్గరగా ఉన్న ఒక రైస్ మిల్లుకు చేరాయని సమాచారం. ప్రజా పంపిణీ బియ్యం బొల్లాపల్లి మండలంలోని ఓ గ్రామానికి చెందిన చౌక ధరల డిపోనకు తరలించాల్సి ఉంది. కానీ ఈ బియ్యం మార్గమధ్యలోనే దారి మళ్లించి సమీపంలోని రైస్ మిల్లులకు తరలించారు. గోదాము నుంచి సుమారు 40 క్వింటాళ్ల తరలి వెళ్తున్న రేషన్ బియ్యం కలిసిన టాటా ఏస్ వాహనాన్ని కొందరు వెంబడించారు. పట్టుకునేందుకు ప్రయత్నించినప్పటికీ అక్రమ వ్యాపారులు వారి కన్నుగప్పి వాహనాన్ని దారి మళ్లించి రైస్ మిల్లుకు చేర్చారు. గ్రామానికి చేరుకోవాల్సిన బియ్యం రాకపోవడంతో గమనించిన పలువురు ఈ విషయంపై అధికారులకు ఫోన్ ద్వారా సమాచారం ఇచ్చేందుకు ప్రయత్నించినప్పటికీ స్పందన లేదు. అధికారుల తీరుపై అనుమానం వ్యక్తం చేస్తున్నారు. వారి అండదండలతో రేషన్ బియ్యం బ్లాక్ మార్కెటుకు తరలి వెళ్తున్నట్లు గ్రామస్తులు తెలిపారు. ఇకనైనా ఉన్నతాధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలని కోరారు.

నాణ్యమైన విద్యుత్ సరఫరా చేయాలి

రాజుపాలెం: వినియోగదారులకు నాణ్యమైన విద్యుత్ అందించాలని ఎస్ఈ డాక్టర్ పి.విజయ్‌కుమార్ సూచించారు. మండలంలోని కొండమోడు విద్యుత్ శాఖ కార్యాలయంలో అధికారులు, సిబ్బందితో శుక్రవారం సమీక్షా సమావేశం శుక్రవారం నిర్వహించారు. ఇందులో ఎస్ఈ మాట్లాడుతూ.. బిల్లుల వసూలులో అలసత్వం వహించిన సిబ్బందిపై కఠిన చర్యలు తీసుకుంటామని తెలిపారు. వేసవిలో టాన్స్‌ఫార్మర్ వద్ద లోడ్ బ్యాలెన్సు చేసుకోవాలని సూచించారు. 50 శాతం అదనపు లోడు సబ్సిడీ స్కీమును గృహ వినియోగదారులు సద్వినియోగం చేసుకుని వెంటనే బిల్లులు చెల్లించాలని తెలిపారు. గ్రామాలలో విద్యుత్ సరఫరాలో అంతరాయాలు ఎక్కువగా ఉన్నాయని తమ దృష్టికి వచ్చిందని, బాధ్యులైన సిబ్బందిపై క్రమశిక్షణ చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ముందుగా మండలంలోని రాజుపాలెం, గణపవరం, అనుపాలెం సబ్ స్టేషన్‌లలో తనిఖీలు చేశారు. సమావేశంలో విద్యుత్ శాఖ డీఈఈ బి.నాగసురేష్ బాబు, మాచర్ల ఈఈ ఎస్. సింగయ్య, ఏఈఈ కోట పెదమస్తాన్, అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



గణపవరం సబ్ స్టేషన్‌లో తనిఖీ చేస్తున్న ఎస్ఈ విజయ్‌కుమార్

దివ్యాంగుల సమస్యలపై దృష్టి సారించాలి

గుంటూరు జేసీ భార్గవ్‌తేజ

గుంటూరు వెస్ట్: దివ్యాంగుల సమస్యలపై అధికారులు దృష్టి సారించి వారి ఇబ్బందులను గుర్తించాలని జాయింట్ కలెక్టర్ ఎ.భార్గవ్‌తేజ తెలిపారు. శుక్రవారం కలెక్టరేట్‌లోని డీఆర్సీ సమావేశ మందిరంలో నిర్వహించిన జిల్లా స్థాయి వికలాంగుల కమిటి సమావేశంలో జేసీ మాట్లాడుతూ సంబంధిత శాఖ అధికారులు వారితో మాట్లాడి సమస్యలను పరిష్కరించేందుకు చర్యలు చేపడతామన్నారు. ఈసందర్భంగా వివిధ దివ్యాంగ సంఘ నాయకులు మాట్లాడుతూ ప్రభుత్వ సంక్షేమ కార్యక్రమాల్లో దివ్యాంగులకు ఐదు శాతం రిజర్వేషన్ కల్పించాలన్నారు. ప్రభుత్వ షాపింగ్ కాంప్లెక్సులు, మున్సిపల్ కాంప్లెక్సుల్లో దుకాణాలు, స్టాల్స్ కేటాయింపులో దివ్యాంగులకు అవకాశాలు కల్పించాలన్నారు. సదరం సర్టిఫికెట్ల జారీలో కూడా ఇబ్బందులు ఎదురవుతున్నాయని పేర్కొన్నారు. వంద శాతం వినికిడి లోపం ఉన్నవారికి ఉచితంగా బస్సు పాస్ ఇవ్వాలన్నారు. దివ్యాంగుల ఉద్యోగాల్లో ఐదు శాతం రిజర్వేషన్ కల్పిస్తే వారి కుటుంబాలు బాగుంటాయని పేర్కొన్నారు. అవసరం మేరకు ట్రైసైకిళ్లు మంజూరు చేయాలని కోరారు. సబ్సిడీ రుణాలు మంజూరు చేయడంలో గ్యారంటీగా ప్రభుత్వ ఉద్యోగి సూరిటీ అడుగుతున్నారని, దీన్ని కొంత ఆలోచించాలని పేర్కొన్నారు. సమావేశంలో వికలాంగుల సంక్షేమ అధికారి సువార్త, జెడ్పి సీఈఓ జ్యోతిబసు, జిల్లా అధికారులు పాల్గొన్నారు.



అధికారులతో సమావేశంలో మాట్లాడుతున్న జేసీ భార్గవ్‌తేజ

పోలీసుల అదుపులో హత్య కేసు నిందితులు

పట్నంబజారు(గుంటూరు ఈస్ట్): గుంటూరు నగరం ఆనందపేటలో గురువారం జరిగిన వృద్ధురాలి హత్య కేసులో పాతగుంటూరు పోలీసులు పురోగతి సాధించారు. ప్రధాన నిందితులను అదుపులోకి తీసుకున్నారు. ఈనెల 3న ఉదయం ఆనందపేటలో వృద్ధురాలు పఠాన్ ఖాజాబీని షేక్ ఫైరోజ్, ఫయాజ్, ఆసీఫ్, సన్ని అనే నలుగురు కొట్టి చంపారు. దీంతోపాటు ఖాజాబీ కుమార్తె షాజహాన్, అల్లుడు హసన్, వీరి కుమారుడు హర్షద్‌లపై దాడి చేసి గాయపరిచారు. ఈ ఘటన నగరంలో కలకలం రేపింది. దీంతో పోలీసులు ఫైరోజ్, ఫయాజ్‌లను అదుపులోకి తీసుకుని విచారణ చేస్తున్నట్లు తెలుస్తోంది. మరో ఇద్దరు నిందితులు ఆసీఫ్, సన్నీలు పరారీలో ఉన్నట్లు సమాచారం. పక్కా పథకం ప్రకారమే దాడికి తెగబడినట్లు నిందితులు అంగీకరించారని తెలుస్తోంది. మరో ఇద్దరు నిందితులను పట్టుకునేందుకు పోలీసులు బృందంగా ఏర్పడి రంగంలో దిగారు.

చికెన్ వల్ల ఎవరికీ బర్డ్‌ఫ్లూ సోకలేదు

నెక్ అడ్వైజర్ డాక్టర్ కరణం బాలస్వామి



నరసరావుపేట: రాష్ట్రంలో కోళ్ల వల్ల బర్డ్‌ఫ్లూ సోకి మనుషులు మృతి చెందిన సంఘటనలు లేవని నేషనల్ ఎగ్ కో ఆర్డినేషన్ కమిటీ (నెక్) అడ్వైజర్ డాక్టర్ కరణం బాలస్వామి పేర్కొన్నారు. అందువలన ప్రతి ఒక్కరూ చికెన్, గుడ్లు తిని దేశాభివృద్ధికి తోడ్పాటు ఇవ్వాలని తెలిపారు. పల్నాడు జిల్లా నరసరావుపేటలో బర్డ్‌ఫ్లూతో మృతి చెందిన చిన్నారి ఆరాధ్య ఉదంతంపై కేంద్ర బృందం శుక్రవారం ఇక్కడకు వచ్చిన సమయంలో బాలస్వామి కూడా వచ్చారు. జరిగిన విషయం తల్లిదండ్రులు, స్థానిక వైద్యులు, పశుసంవర్ధక శాఖ అధికారులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ.. గత 25 ఏళ్ల నుంచి బర్డ్‌ఫ్లూ కోళ్లకు వస్తున్నా మనుషులకు సంక్రమించిన దాఖలాలు లేవని అన్నారు. ఆరాధ్య మృతికి సంబంధించి పౌల్ట్రీ రంగంపై నిందలు వేయటం తగదన్నారు. బర్డ్‌ఫ్లూతో రెండు తెలుగు రాష్ట్రాల్లో లక్షల కోళ్లు మృతి చెందినా, మనుషులకు ఈ వ్యాధి ఇప్పటివరకు సోకలేదని చెప్పారు. ఇటీవలనే తణుకులో రెండు లక్షల కోళ్లు, తెలంగాణలోని చౌటుప్పల్‌లో భారీగా కోళ్లు చనిపోయాయని గుర్తుచేశారు. వాటిని తొలగించి ఖననం చేసే కూలీలకు కూడా ఈ వ్యాధి సోకలేదని అన్నారు. చికెన్ తింటున్న వారికి సంక్రమించలేదని అన్నారు.

వైఎస్సార్ సీపీ సోషల్ మీడియా కార్యకర్తకు బెయిల్



చిలకా రవి

క్రోసూరు: క్రోసూరుకు చెందిన వైఎస్సార్ సీపీ సోషల్ మీడియా కార్యకర్త, ఎంపీటీసీ చిలకా ప్రసన్న భర్త చిలకా రవికి శుక్రవారం బెయిల్ లభించింది. గత శనివారం సోషల్ మీడియాలో పెట్టిన పోస్టుపై టీడీపీ నాయకులు అభ్యంతరం తెలుపుతూ కేసు పెట్టగా... పోలీసులు అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. మాజీ ఎమ్మెల్యే నంబూరు శంకరరావు సహకారంతో న్యాయవాది సుబ్బారెడ్డి వాదించారు. దీంతో బెయిల్ వచ్చినట్లు రవి తెలిపారు.

‘రంగస్థలం’.. ఓ జీవన విధానం

- అపోహలు వీడి వాస్తవాల్ని కనండి
- ప్రముఖ నాటక కళాకారిణి లహరి



లహరి

యడ్లపాడు: ఓపిక, పట్టుదల, కళపై ప్రేమ ఉంటే రంగస్థలం ఎంత గొప్ప వేదికో తెలుస్తుందని ప్రముఖ నాటక కళాకారిణి లహరి చెప్పారు. పుచ్చలపల్లి సుందరయ్య నాటికల పోటీల నిమిత్తం ఆమె యడ్లపాడు విచ్చేశారు. ఎన్నో అవాంతరాలు దాటి రంగస్థలంపై నటనతో తనదైన ముద్ర వేసిన లహరి తన అనుభవాలను ‘సాక్షి’తో పంచుకున్నారు. నాటకాలు ఆడే వారిపై సమాజంలో చిన్నచూపు తగదని పేర్కొన్నారు. మహిళలు కూడా రాణించే అవకాశం ఉందన్నారు.

ప్రతిభ చాటొచ్చు...

స్త్రీ పాత్రలకు ఒకప్పుడు పారితోషికాలు సరిగ్గా ఇవ్వలేని స్థితి ఉండేదన్నారు. ఇప్పుడు పరిస్థితి మారిందని చెప్పారు. క్షేత్రస్థాయిలో ప్రతిభను చాటి నటనకు మరిన్ని మెరుగులు దిద్దుకునే గొప్ప వేదిక రంగస్థలం అన్నారు. దర్శకత్వం కూడా చేసినట్లు చెప్పారు. బీటెక్ పూర్తి చేసిన తర్వాత రంగస్థలాన్ని ఎంచుకున్నట్లు వివరించారు. అదేస్థాయిలో సంపాదన ఆర్జించటమే కాకుండా ప్రజలను చైతన్యపరిచే గొప్ప అవకాశం, అనుభూతి లభించాయన్నారు. కుటుంబ సభ్యుల్లా అందరూ మెలుగుతున్నారని, మహిళలకు ఎలాంటి ఇబ్బంది లేదని చెప్పారు. కళలకు గొప్ప భవిష్యత్తు ఉందని ఆమె చెప్పారు. ‘ఇప్పుడు రూ.కోట్లు వెచ్చించి సినిమాలు తీసినా, ప్రేక్షకులు ఇది ఏఐతో చేశారేమో అని అనుమానిస్తున్నారని పేర్కొన్నారు. రంగస్థలంపై నటన మాత్రం నవరసాలతో నిండినదన్నారు. ఎలాంటి ఎఫెక్టులు ఉండనందున నేరుగా ప్రేక్షకుల మనసుకు తాకే అవకాశం ఉంటుందని తెలిపారు. నాటకరంగం పట్ల సమాజాన్ని మరింత చైతన్యం చేయాల్సిన బాధ్యత రచయితలు, మీడియా, ప్రభుత్వంపై ఉందన్నారు. తల్లిదండ్రులు కూడా ఈ రంగంపై ఆసక్తి కలిగిన పిల్లలను ప్రోత్సహించాలని కోరారు.

సుందరయ్య పురస్కారం అందుకోవడం అదృష్టం



పురస్కారం అందుకుంటున్న సజ్జాజు బాలచందర్

- సంస్కృతి సంస్థ అధినేత సజ్జాజు బాలచందర్
- ప్రారంభమైన సుందరయ్య కళానిలయం నాటిక పోటీలు
- తొలిరోజు ముచ్చటగా మూడు ప్రదర్శనలు



పుచ్చలపల్లి సుందరయ్య చిత్రపటానికి నివాళులు అర్పిస్తున్న నిర్వాహకులు

యడ్లపాడు: తన జీవితాన్ని సమాజసేవకు అంకితం చేసిన మహోన్నత వ్యక్తి పుచ్చలపల్లి సుందరయ్య అని కమ్యూనిస్టు నాయకులు పేర్కొన్నారు. పుచ్చలపల్లి సుందరయ్య కళానిలయం 22వ జాతీయస్థాయి నాటిక పోటీలు శుక్రవారం రాత్రి ప్రారంభం అయ్యాయి. ముందుగా సుందరయ్య చిత్రపటానికి కమ్యూనిస్టులు, పరిషత్ నిర్వాహకులు పూలమాలలు వేసి నివాళి అర్పించారు. అనంతరం తొలిరోజు ప్రదర్శనలు ప్రారంభం అయ్యాయి. ఈ సందర్భంగా రంగస్థలానికి దశాబ్దాలుగా ఎనలేని సేవలు అందించిన గుంటూరు సంస్కృతి వ్యవస్థాపకులు సజ్జాజు బాలచందర్‌కు పుచ్చలపల్లి సుందరయ్య పురస్కారం ప్రదానం చేశారు. కళానిలయం ప్రతినిధులు ఆయనకు సత్కార పత్రాన్ని అందించి, ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో ముఖ్య అతిథిగా ఆజో, విభో కందాళం ఫౌండేషన్ ఆచార్య అప్పాజోస్యుల సత్యనారాయణ ‘బాలచందర్ జీవిత గ్రంథాన్ని’ ఆవిష్కరించారు. డాక్టర్ ముత్తవరపు సురేష్‌బాబు, అరుణ కుమారి దంపతులు అధ్యక్షత వహించిన ఈ కార్యక్రమంలో రచయితలు పి.మృత్యుంజయరావు, జరుగుల రామారావు, కమ్యూనిస్టు నాయకులు వై. రాధాకృష్ణ, పీవీ రమణ, పోపూరి సుబ్బారావు, టి. కోటేశ్వరరావు, నూతలపాటి కాళిదాసు, జరుగుల శంకరరావు, టీవీ మల్లికార్జునరావు, ప్రజాగాయకులు తదితరులు పాల్గొన్నారు.

వైవిధ్య అంశాలపై ప్రదర్శనలు

- వైద్యవిద్యలో చేసిన ప్రతిజ్ఞను మరవద్దని తెలియజేసేలా ‘చిగురుమేఘం’ నాటిక ప్రదర్శన కొనసాగింది. అమరావతి ఆర్ట్స్(గుంటూరు) ప్రదర్శించిన ఈ నాటికను కావూరి సత్యనారాయణ రచించగా, ఏపూరి హరిబాబు దర్శకత్వం వహించారు.
- ఉన్నత విద్యకంటే కుటుంబ పెద్దల జ్ఞానం గొప్పదని చెప్పిన ‘కిడ్నాప్’ నాటిక ఆలోచింపజేసింది. తల్లిదండ్రుల ప్రేమ, విలువల్ని, అనుబంధాన్ని హృదయానికి హత్తుకునేలా సాగింది. ఉషోదయ కళానికేతన్ (కట్రపాడు) వారి ఈ నాటికకు రచన, దర్శకత్వం చెరుకూరి సాంబశివరావు.
- కుటుంబ వ్యవస్థ నైతిక విలువలకు పునాది అని చెప్పేలా ‘విడాకులు కావాలి’ నాటిక సాగింది. వల్లూరి శివప్రసాద్ రచించిన దీనికి గంగోత్రి సాయి దర్శకత్వం వహించారు. అరవింద ఆర్ట్స్ (తాడేపల్లి) వారు ఈ నాటికను సమర్పించారు.

క్రైస్తవులకు ప్రభుత్వం రక్షణ కల్పించాలి

ఐఆర్ఈఎఫ్ అధినేత బిషప్ డాక్టర్ ఇమ్మానుయేలు రెబ్బా

రేపల్లె రూరల్: క్రైస్తవుల భద్రతకు ప్రభుత్వం రక్షణ కల్పించాలని ఐఆర్ఈఎఫ్ అధినేత బిషప్ డాక్టర్ ఇమ్మానుయేలు రెబ్బా అన్నారు. అనుమానాస్పద స్థితిలో ఇటీవల మృతి చెందిన పాస్టర్ పగడాల ప్రవీణ్ ఆత్మకు శాంతి చేకూరాలని కోరుతూ రేపల్లె క్రైస్తవ సంఘాల ఆధ్వర్యంలో శుక్రవారం నిర్వహించిన శాంతి ర్యాలీలో ఆయన పాల్గొని మాట్లాడారు. దేవుని వాక్యాన్ని ప్రజలకు చేర్చి పరిశుద్ధులను చేసే పాస్టర్‌లపై దాడులకు పాల్పడటం అమానుషమని పేర్కొన్నారు. క్రైస్తవులపై దాడులు జరగకుండా ప్రభుత్వం పటిష్ట చర్యలు తీసుకోవాలని కోరారు. పాస్టర్ ప్రవీణ్ మృతిపై ప్రభుత్వం దర్యాప్తును వేగవంతం చేసి నిందితులను కఠినంగా శిక్షించాలన్నారు. వైఎస్సార్ సీపీ క్రిస్టియన్ మైనార్టీ బాపట్ల జిల్లా మాజీ అధ్యక్షుడు చిత్రాల ఓబేదు మాట్లాడుతూ పాస్టర్ ప్రవీణ్ మృతిపై పలు అనుమానాలు ఉన్నాయన్నారు. ప్రభుత్వం అన్నికోణాలలో సమగ్ర విచారణ జరిపి తగు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. భవిష్యత్‌లో పాస్టర్‌లపై దాడులు జరగకుండా ప్రభుత్వం కఠిన చట్టాలను రూపొందించి అమలు చేయాలని డిమాండ్ చేశారు. ప్రవీణ కుటుంబ సభ్యులకు క్రైస్తవ సంఘాలు అన్ని వేళలా అండగా నిలుస్తాయని అన్నారు. ర్యాలీ బస్టాండ్, మున్సిపల్ కార్యాలయం, నెహ్రూ బొమ్మ సెంటరుల మీదగా తహసీల్దార్ కార్యాలయానికి చేరుకుని తహసీల్దార్, పోలీసుస్టేషన్‌లలో వినతిపత్రాలు అందజేశారు. క్రైస్తవ సంఘాల నాయకులు గుజ్జర్లమూడి ప్రశాంత్‌కుమార్, గుజ్జర్లమూడి ఇమ్మానుయేలు, సముద్రాల ప్రభుకిరణ్, షేక్ ఖుద్దూష్, ఆలా రాజ్‌పాల్, జాలాది మునియ్య, జాలాది సునీల్, వివిధ చర్చిల పాస్టర్‌లు పాల్గొన్నారు.

ధాన్యానికి మద్దతు ధర చెల్లించాలి

చీరాల టౌన్: ఆరుగాలం కష్టించి పండించిన పంటకు గిట్టుబాటు ధర ఇవ్వలేని ప్రభుత్వం ఓ వైపు.....అకాల వర్షంతో అన్నదాతలు పండించిన పంట తడిచి రైతులను నట్టేట ముంచిందని ధాన్యానికి మద్దతు ధర ఇచ్చి ప్రభుత్వం కొనుగోలు చేయాల్సిందేనని వైఎస్సార్ సీపీ రైతు విభాగం నియోజకవర్గ అధ్యక్షులు కావూరి రమణారెడ్డి డిమాండ్ చేశారు. ఈపురుపాలెం తదితర గ్రామాల్లో శుక్రవారం తెల్లవారుజామున కురిసిన అకాల వర్షానికి కల్లాల్లో తడిచిన ధాన్యాన్ని వైఎస్సార్‌సీపీ రైతు విభాగం అధ్యక్షులు పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ రైతులు తీవ్రంగా నష్టపోయారని, ప్రభుత్వం పట్టించుకోకపోవడం దుర్మార్గమన్నారు. రబీ ధాన్యాన్ని కూడా కొనుగోలు చేయలేని స్థితిలో ప్రభుత్వం ఉండటం దారుణమన్నారు. ప్రభుత్వం ధర రూ.1750 ఉండగా రబీ ధాన్యాన్ని కొనుగోలు చేయకపోవడంతో ప్రైవేటు వ్యాపారులు, దళారులు బస్తాను రూ.1350కి కొనుగోలు చేయడంతో రైతులు ఆర్థికంగా నష్టపోతున్నారని అన్నారు. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో రబీ ధాన్యాన్ని మార్చిలోనే కొనుగోలు చేసి రైతులను ఆదుకోగా అధికారంలోకి వచ్చిన టీడీపీ, కూటమి ప్రభుత్వం రైతులను పట్టించుకోకపోవడం దారుణమన్నారు. ఒకవైపు పండించిన పంటకు గిట్టుబాటు ధర రాకపోవడం, మరోవైపు ప్రభుత్వం పట్టించుకోకపోవడం మళ్లీ అకాల వర్షాల కారణంగా కల్లాల్లో ఉన్న ధాన్యం తడిచిపోవడంతో అన్నదాత తీవ్రంగా నష్టపోయాడని అన్నారు. రైతుల కష్టాలను గుర్తించి సీఎం చంద్రబాబు బస్తాకు రూ.1750 ఇచ్చి ధాన్యాన్ని కొనుగోలు చేయాలని డిమాండ్ చేశారు. అన్నదాతలను ఇబ్బందులకు గురిచేస్తే పార్టీ తరపున పోరాడి అండగా నిలబడతామన్నారు. రైతులను పరామర్శించిన వారిలో పలువురు నాయకులు ఉన్నారు.

రైలు కింద పడి వృద్ధుడు ఆత్మహత్య



సంఘటనా స్థలంలో మృతదేహం

నరసరావుపేటటౌన్: రైలు కింద పడి వ్యక్తి ఆత్మహత్యకు పాల్పడి సంఘటన శుక్రవారం సాతులూరు రైల్వే స్టేషన్ సమీపంలో చోటుచేసుకుంది. రైల్వే పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. సాతులూరు రైల్వే స్టేషన్ సమీపంలో హుబ్లీ ఎక్స్‌ప్రెస్ కింద పడి పెద్దచెరువు ప్రాంతానికి చెందిన గాలి థామస్(70) ఆత్మహత్యకు పాల్పడ్డాడు. గమనించిన పైలెట్ సమాచారాన్ని నరసరావుపేట రైల్వే పోలీసులకు అందించారు. ఎస్ఐ శ్రీనివాసనాయక్ సంఘటనా స్థలానికి చేరుకొని మృతదేహాన్ని పరిశీలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు. ఆత్మహత్యకు గల కారణాలు తెలియాల్సి ఉందన్నారు.

కూలీల ఆటో బోల్తా.. ఒకరు మృతి





చికిత్స పొందుతున్న క్షతగాత్రులు

మరో ఏడుగురికి తీవ్రగాయాలు



జోజమ్మ మృతదేహం

వినుకొండ: మిరపకాయల కూలీల ఆటో తిరబడి ఒకరు మృతి చెందగా.. మరో ఏడుగురికి తీవ్ర గాయాలయ్యాయి. ఈ సంఘటన మండలంలోని ఏనుగుపాలెం సమీపంలో జరిగింది. ఉమ్మడివరం నుంచి నూజెండ్ల మండలం త్రిపురాపురం గ్రామానికి మిర్చి కోసేందుకు ప్రతిరోజు కూలీలు వెళ్తా ఉంటారు. ఉదయం ఏనుగుపాలెం సమీపంలో ఆటో తిరగబడింది. ఈ ప్రమాదంలో జోజమ్మ (60) మృతి చెందింది. మార్తమ్మ, వెంకాయమ్మ, అంకమ్మ, కోటమ్మ, మరియమ్మ, ఆదెమ్మ తదితర ఏడుగురికి తీవ్రగాయాలయ్యాయి. స్థానికులు 108కి సమాచారం ఇవ్వడంతో వారిని వినుకొండ ప్రభుత్వాసుపత్రికి తరలించారు. మెరుగైన వైద్యం అందిస్తున్నారు.

రైలు ఢీకొని వ్యక్తి మృతి

పిడుగురాళ్ల: రైలు ప్రమాదంలో వ్యక్తి మృతి చెందిన సంఘటన పట్టణంలోని జానపాడు రోడ్డులో రైల్వే గేటు సమీపంలో శుక్రవారం జరిగింది. రేపల్లె నుంచి సికింద్రాబాద్‌కు ఎక్స్‌ప్రెస్ రైలు వెళ్తుండగా ఈ దుర్ఘటన చోటుచేసుకుంది. జానపాడు రైల్వే గేటు సమీపంలో కారంపూడికి చెందిన ఏనుగుల రామయ్య(70) పట్టాలు దాటకుండా అలాగే ఉన్నాడు. రైలు హారన్ కొట్టినప్పటికీ ఫలితం లేకుండా పోయింది. దీంతో రైలు ఢీకొంది. రామయ్య అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుని చొక్కా జేబులో ఆధార్ కార్డు ఉండటంతో అతను కారంపూడి గ్రామంలోని కోట బజారులో నివసించే ఏనుగుల రామయ్యగా గుర్తించారు. కారంపూడి నుంచి పిడుగురాళ్లకు వచ్చిన ఆర్టీసీ బస్సు టిక్కెట్ ఉండటంతో మృతదేహాన్ని వెంటనే గుర్తించామని నడికుడి రైల్వే ఎస్ఐ శ్రీనివాసనాయక్ తెలిపారు. మృతదేహం పోస్టుమార్టం నిమిత్తం గురజాల ప్రభుత్వ వైద్యశాలకు తరలించామని చెప్పారు.

కార్మికుల సమస్యలు పరిష్కరించాలి



ర్యాలీ నిర్వహిస్తున్న రాజధాని కార్మికులు

తాడికొండ: రాజధానిలో కార్మికుల సమస్యలు పరిష్కరించాలని సీఐటీయూ గుంటూరు జిల్లా అధ్యక్షులు బి.లక్ష్మణరావు డిమాండ్ చేశారు. శుక్రవారం తుళ్ళూరులో కార్మికులతో కలిసి సీఐటీయూ నేతలు నిరసన ర్యాలీ నిర్వహించారు. అనంతరం సీఆర్డీయే కార్యాలయం ఎదుట ధర్నా చేశారు. వినతిపత్రం అందించారు. కార్యక్రమంలో సీఐటియు రాజధాని డివిజన్ అధ్యక్ష, కార్యదర్శులు ఎం రవి, ఎం భాగ్యరాజు, కార్మిక సంఘం నాయకులు సీహెచ్ సుశీల, ఏసుదయమ్మ, బుజ్జి తదితరులు పాల్గొన్నారు.